ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి: హరగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం నేత హరగోపాల్ తదితరులు

సుల్తాన్‌బజార్: ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని పౌరహక్కుల నేత, ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బలగాలను మోహరించి హత్యాకాండను కొనసాగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆపరేషన్ కగార్ హత్యాకాండపై జాతీయస్థాయి ప్రజాస్వామిక హక్కుల సమన్వయ సంస్థ, ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో నిజనిర్ధారణ కమిటీ ఇచ్చిన రిపోర్టును మంగళవారం ఇక్కడ విడుదల చేశారు. హరగోపాల్ మాట్లాడుతూ మావోయిస్టుల పేరుతో అమాయక ఆదివాసీలను చంపేస్తున్నారని, మహిళలను అత్యాచారం చేసి హత్య చేసి మావోయిస్టులుగా చిత్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించి, బాధ్యులైన పోలీసు అధికారులను కఠినంగా శిక్షించాలన్నారు. సమావేశంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణ రావు పాల్గొన్నారు.

నిజాం కళాశాలలో బోనాల వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్ భీమా తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా అన్నారు. ఈ మేరకు మంగళవారం నిజాం కళాశాలలోని అమ్మవారి దేవాలయం వద్ద ఆషాఢ బోనాల వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఉద్యోగులు, విద్యార్థులు హాజరై అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ సురేఖ ఓంప్రకాష్, ఓయూ వీసీ ఓఎస్‌డీ రెడ్యానాయక్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డాక్టర్ బోయకుమార్, నవీన్, యాదగిరి, రమేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మహిళా మోర్చా బోనాల సమర్పణ



నల్లపోచమ్మ అమ్మవారికి బోనాలు తీసుకొస్తున్న డాక్టర్ శిల్పారెడ్డి

చాంద్రాయణగుట్ట: ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా మేకలబండ నల్లపోచమ్మ అమ్మవారికి బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో బోనాలు సమర్పించారు. మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి ఆధ్వర్యంలో మహిళలు పెద్దఎత్తున ఊరేగింపుగా తరలివచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు పొన్న వెంకటరమణ వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళామోర్చా ఉపాధ్యక్షురాలు గీతారెడ్డి, ప్రధాన కార్యదర్శులు సమత, సుధా, కార్యదర్శి దశరథ లక్ష్మీ, గోల్కొండ జిల్లా అధ్యక్షురాలు నిత్య పారికర్, భాగ్యనగర జిల్లా కార్యదర్శులు లావణ్య, స్వప్న, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి గోల్కొండ నవీన్ చారి, కోశాధికారి మాణిక్ ప్రభు, అభిషేక్ యాదవ్, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

‘భాగ్యలక్ష్మీ’కి బంగారు బోనం

- మీరాలంమండి దేవాలయం నుంచి ఊరేగింపు
- ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో జాతర
- సప్త మాతృకలకు సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా..
- 25న లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారికి బంగారు బోనం



కోట మైసమ్మతల్లికి బంగారు బోనంతో ప్రత్యేక పూజలు



భాగ్యలక్ష్మీ అమ్మవారికి బంగారు బోనం సమర్పిస్తున్న దృశ్యం



చార్మినార్ భాగ్యలక్ష్మీ దేవాలయం వద్ద జోగిని నిషాక్రాంతి

చార్మినార్: పాతబస్తీ భక్తులు చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారికి భక్తి శ్రద్ధలతో బంగారు బోనం సమర్పించారు. భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భక్తులు ఊరేగింపుగా భాగ్యలక్ష్మీ ఆలయానికి చేరుకున్నారు. సప్త మాతృకలకు సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా కమిటీ ఆధ్వర్యంలో విజయవాడతోపాటు నగరంలోని అమ్మవారి దేవాలయాల్లో బంగారు బోనాలను సమర్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే గోల్కొండ జగదాంబ అమ్మవారికి, బల్కంపేట ఎల్లమ్మ తల్లికి, జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి, విజయవాడ కనకదుర్గమ్మ తల్లికి, సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాంకాళీ అమ్మవారికి బంగారు బోనాలు సమర్పించారు. తాజాగా భాగ్యలక్ష్మీ అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు.

మీరాలంమండి దేవాలయం నుంచి..



మీరాలంమండి దేవాలయం వద్ద బంగారు బోనంతో చైర్మన్ గాజుల అంజయ్య

మీరాలంమండి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అంగరంగ వైభవంగా చార్మినార్‌కు బయలుదేరారు. పోతురాజుల నృత్యాలు, కళాకారుల ప్రదర్శనలు తరలిరాగా బోనం, పట్టువస్త్రాలు, వడి బియ్యం సమర్పించారు. చార్మినార్ వద్ద ఆలయ ట్రస్టీ శశికళ బంగారు బోనానికి స్వాగతం పలికారు. దక్షిణ మండలం ట్రాఫిక్ పోలీసులు ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకున్నారు. చార్మినార్ ఇన్‌స్పెక్టర్ కమతం చంద్రశేఖర్ చార్మినార్ దేవాలయం వద్ద బందోబస్తును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య మాట్లాడుతూ సప్త మాతృకలకు సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే అమ్మవారి దేవాలయాల్లో బంగారు బోనాలను సమర్పించామన్నారు. ఈ నెల 25న లాల్‌దర్వాజ సింహవాహిని దేవాలయం అమ్మవారికి సమర్పించే బంగారు బోనంతో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. ఈసారి సిల్వర్ జూబ్లీ బోనాల జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్న హరిబౌలిలోని బంగారు మైసమ్మ అమ్మవారికి సైతం బంగారు పాత్రలో నైవేద్యంతోపాటు పట్టువస్త్రాలు, వడి బియ్యం సమర్పించనున్నామన్నారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు మధుసూదన్ యాదవ్‌తోపాటు మాజీ చైర్మన్ పాటిల్ సదానంద్ యాదవ్, అనంతోజ్ హన్స్ రాజ్, కోట మైసమ్మ దేవాలయం కమిటీ అధ్యక్షులు రాయికోటి బాబురాజా, కోశాధికారి ప్యారసాని వెంకటేష్, కార్యదర్శి అశోక్ యాదవ్, నర్సింగ్ జైస్వాల్,కాట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానం



మంత్రి ప్రభాకర్‌ను ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

గౌలిపురా: గౌలిపురాలోని శ్రీ మహంకాళి మాతేశ్వరి భరతమాత దేవాలయం, శ్రీ కోట మైసమ్మ దేవాలయంలో నిర్వహించే బోనాల జాతర ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ మంళవారం ఆలయ కమిటీ ప్రతినిధులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ని కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. అనంతరం మంత్రిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్.ఆనంద్ రావు, ఉపాధ్యక్షులు జ్ఞానేశ్వర్ ముదిరాజ్, బి.వై.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను అరికట్టాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ రెడ్యానాయక్

గన్‌ఫౌండ్రీ: సామాజిక స్పృహతో సమాజం నుంచి డ్రగ్స్‌ను పారద్రోలాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఓయూ వీసీ ఓఎస్‌డీ ప్రొఫెసర్ రెడ్యా నాయక్ అన్నారు. మంగళవారం బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాలలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వల్ల వ్యక్తుల జీవితాలే కాకుండా సమాజం ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ సురేఖ ఓంప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా, వైస్ ప్రిన్సిపాల్ ఉపేందర్ రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కళాశాల ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు, మంజుల, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

‘పెట్టుబడి’ వేడుక



బహదూర్‌పురా: హైదరాబాద్‌లోని సిక్కు చావనియాట్‌లోని గురునానక్ హైస్కూల్‌లో అత్యంత పవిత్రమైన ఉత్సవం సందర్భంగా పెట్టుబడి వేడుకను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ సర్దార్ని హర్బన్స్ కౌర్‌జీ, అతిథి అపర్ణ శంకర్‌జీ, ప్రెసిడెంట్ సిక్కు ఎడ్యుకేషన్ సొసైటీ ఎస్.ప్రీతమ్ సింగ్ మాట్లాడుతూ కొత్తగా నియమించిన పాఠశాల కేబినెట్‌కు బాధ్యతను అప్పగించే సందర్భంగా ఇన్వెస్టిచర్ వేడుకలను నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థులు సమయపాలన, అంకితభావం, క్రమశిక్షణ, సంకల్పం వంటి విలువలను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గురునానక్ హైస్కూల్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.బహదూర్ సింగ్, సెక్రటరీ, కరస్పాండెంట్ జీఎన్‌హెచ్‌ఎస్ డాక్టర్ ఎస్.సజ్జన్ సింగ్, ప్రిన్సిపాల్ రుక్సానా అహ్మద్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకున్న ప్రభాకర్‌గౌడ్ దంపతులు

చాంద్రాయణగుట్ట: ఆషాఢ మాసం 75వ వార్షిక బోనాల ఉత్సవాలలో భాగంగా ఉప్పుగూడ మహంకాళి అమ్మవారి ఆలయాన్ని మంగళవారం భవానీ ఫైర్‌వర్క్స్ యజమాని ఈదులకంటి ప్రభాకర్ గౌడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నవ మహాహారతులు, వేద పండితులచే ఆశీర్వచనం జరిపించారు. ఆలయ కమిటీ చైర్మన్ జనగామ మధుసూదన్ గౌడ్ దంపతులు ప్రభాకర్‌గౌడ్ దంపతులను శాలువాతో సన్మానించి ప్రసాదాన్ని అందజేశారు.

కనక దుర్గమ్మ ఆలయంలో బోనాలు

నాంపల్లి: గృహకల్ప భవన సముదాయంలోని శ్రీ కనకదుర్గమ్మ దేవాలయంలో మంగళవారం బోనాల వేడుకలు జరిగాయి. తెలంగాణ హౌసింగ్ బోర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. లలిత అనే మహిళా ఉద్యోగి మోకాళ్ల మీద నడుచుకుంటూ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన పోతురాజు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా హౌసింగ్ బోర్డు చీఫ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి రాజేశం, జనరల్ మేనేజర్ మధుకర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాధాకృష్ణ హాజరయ్యారు. వీరికి తెలంగాణ హౌసింగ్ బోర్డు ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ ఘనంగా స్వాగతం పలికారు.



అతిథులను సత్కరిస్తున్న ఎం.వి.రమణారెడ్డి, జగదీశ్వర్

ఘనంగా ‘బాలానంద’ వార్షికోత్సవాలు



సినీనటుడు అశోక్‌కుమార్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న రఘురాం

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జాంబాగ్ బాలానంద సంఘం 60వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ నటుడు అశోక్‌కుమార్‌కు మద్దిపట్ల వెంకట్‌రావు స్మారక పురస్కారాన్ని ప్రదానం చేశారు. అంతకుముందు చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన, నాటక పోటీలు ఆకట్టుకున్నాయి. సెమీ క్లాసికల్ డ్యాన్స్, నాటకం అనే అంశాలపై నిర్వహించిన పోటీలలో గెలుపొందిన చిన్నారులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ కార్యదర్శి మద్దాలి రఘురాం, కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత చొక్కాపు వెంకటరమణ, జాంబాగ్ బాలానంద సంఘం అధ్యక్షులు మద్దిపట్ల వెంకటభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా ఎల్లమ్మ అమ్మవారు

గౌలిపురా: గౌలిపురా పటేల్‌నగర్‌లోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో బోనాల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం అమ్మవారికి అభిషేకం, స్థాపిత దేవత ఆరాధన, వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు, అమ్మవారి కల్యాణ మహోత్సవం పూజ కార్యక్రమంలో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం భాగ్యనగర్ ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ అమ్మవారికి ఒడిబియ్యం, పట్టు వస్త్రాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న అంజయ్య కుటుంబ సభ్యులు

సామూహిక కంకుమార్చన



సామూహిక కుంకుమార్చన పాల్గొన్న మహిళలు

యాకుత్‌పురా: ఆషాఢమాసం బోనాల ఉత్సవాల సందర్భంగా హరిబౌలి గజానన వ్యాయామశాల శ్రీ మాతేశ్వరీ పోచమ్మ, మహాంకాళీ దేవాలయంలో మంగళవారం అమ్మవారి సామూహిక కుంకుమార్చన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఉదయం అమ్మవారికి అభిషేకం, వివిధ రకాల పుష్పాలతో అలంకరణ నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 155 మంది మహిళలు పాల్గొని అమ్మవారికి అర్చన నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ మాతేశ్వరీ పోచమ్మ, మహాంకాళీ దేవాలయం కమిటి సభ్యులు కేడాల దినేష్, ప్రభునాథ్, ప్రకాష్, మన్మోహన్, అజయ్, శ్రవణ్, రవీందర్ చారి, గోపాల్ యాదవ్ వేదసాయి, శ్రీనివాస్ పాల్గొన్నారు. అర్చకులు రంగనాథ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు జాబ్‌మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి అమర్లపురి వందన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోర్ట్ ఇండియా ల్యాబ్స్ ప్రైవేటు లిమిటెడ్, బీఎస్సీపీఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఐఎఫ్‌బీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థల్లోని 200 ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఎస్ఎస్సీ, ఇంటర్మీడియెట్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు 18 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఫొటోలు, సర్టిఫికెట్లతో బుధవారం ఉదయం 10.30 గంటలకు విజయనగర్ కాలనీలో ఉన్న హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నేరుగా హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 83284 28933 నెంబర్‌లో సంప్రదించవచ్చు.

నేడు మీరాలంమండిలో శాకంబరి పూజలు

చార్మినార్: మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర దేవాలయంలోని అమ్మవారికి బుధవారం శాకంబరి పూజలు ఘనంగా జరుగనున్నాయి. నిజాం కాలం నుంచి నగర ప్రజలకు కూరగాయలు అందించే మార్కెట్‌గా కొనసాగుతున్న మీరాలంమండి కూరగాయల మార్కెట్‌లో వెలిసిన అమ్మవారిని దాదాపు 100 క్వింటాళ్ల వివిధ రకాల కాయకూరలు, ఆకుకూరలతో ఆకర్షణీయంగా అలంకరించనున్నామని దేవాలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు.

బోనాల ఉత్సవ కమిటీ ఎన్నిక

జియాగూడ: జియాగూడ కురుమ బస్తీ శ్రీ మహాంకాళి మాత 88వ బోనాల వార్షిక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నట్లు అధ్యక్షుడు ఉల్పే శ్రీనివాస్ వెల్లడించారు. ఈ మేరకు బోనాల కమిటీని మంగళవారం ఎన్నుకున్నట్లు చెప్పారు. నూతన కమిటీ అధ్యక్షునిగా ఉల్పే శ్రీనివాస్, కోశాధికారి దేవర శివశంకర్, సహ కార్యదర్శి దేవర మహేష్, ప్రధాన కార్యదర్శి లక్కు అమర్నాథ్, ఉపాధ్యక్షులు దన్ని శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉల్పే గోవింద్‌రాజ్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులు కుల్ఫి కుమార్ జ్యోతి, ఆనంద్‌కుమార్, జూకంటి వీరేందర్, ఉల్పే శ్రీనివాస్, గంగాల పండరి, గంగాల రాఘవేందర్, మరాఠి రూపేష్, సాయికుమార్, సలహాదారులు గడ్డం నర్సింగ్ రావు, దన్ని మాణిక్‌రావు, దన్ని ఈశ్వరయ్య, కోరి రాములు, కృష్ణ, గంగాల సత్యానారాయణ, జ్యోతి అమర్‌బాబు, ఆకుల సంతోష్, తిప్పి సురేష్ తదితరులు నియమితులయ్యారు.

కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

గోల్కొండ: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రజల నుంచి మిశ్రమ స్పందన లభిస్తోంది. రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్ రూపకల్పన జరిగిందని పలువురు అంటున్నారు. ఎన్‌డీఏ భాగస్వాముల ఒత్తిళ్ల మేరకు బడ్జెట్ రూపొందించారని కాంగ్రెస్ నేత టి.జీవన్‌సింగ్ ఆరోపించారు. సామాన్యులకు ఈ బడ్జెట్ వల్ల ఒరిగేదేమి ఉండదని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లలో ఇదే అత్యుత్తమ బడ్జెట్ అని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. సామాన్యులు, రైతుల పట్ల బీజేపీ ప్రభుత్వం తన నిబద్ధతను చాటుకుందని పేర్కొన్నారు.



వైభవంగా ఘటం ఊరేగింపు

గోల్కొండ: కార్వాన్ సబ్జీమండలిలోని శ్రీశ్రీ నల్లపోచమ్మ మహాంకాళి దేవాలయ 102వ వార్షిక బోనాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఘటాన్ని పురవీధుల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు బోనాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. బుధవారం ప్రత్యేక పూజలు, ఈ నెల 25, 26, 27వ తేదీల్లో పెద్ద తొట్టెల ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు పూజా కమిటీ అధ్యక్షుడు పి.నందకిషోర్ తెలిపారు. అంబారీపై ఊరేగింపు ఉంటుందన్నారు. ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కుడుముల రాకేష్, కోశాధికారి కట్ట శ్రీనివాస్, సలహాదారులు కట్ట శివరాజ్, వేణుకుమార్, కట్ట నర్సింగ్‌రావు, జి.అశోక్‌కుమార్, నిరంజన్ పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దేవర శ్రీనివాస్



నియామకపత్రం అందుకుంటున్న దేవర శ్రీనివాస్

గోల్కొండ: రాష్ట్ర రైతులు బీజేపీని ఏకపక్షంగా సమర్థిస్తున్నారని బీజేపీ కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. గుడిమల్కాపూర్‌కు చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమిస్తూ మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి పాలనలో సైతం తెలంగాణ ప్రజానీకం తీవ్ర అసంతృప్తితో ఉందన్నారు. ఉత్తుత్తి వాగ్దానాలు, అమలు కానీ హామీలను ఇస్తూ ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రేమేందర్‌రెడ్డి తదితరులున్నారు.

తెలంగాణకు కేంద్రం మొండిచెయ్యి



గౌరీ సతీష్

అఫ్జల్‌గంజ్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మోదీ ప్రభుత్వం మొండి చెయ్యి చూపిందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్ అన్నారు. మంగళవారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ పేరు కూడా లేకపోవడం శోచనీయమన్నారు. తెలంగాణలో ట్రిపుల్ ఆర్‌కు కానీ, ఇతర అభివృద్ధి పనులకు కానీ నయా పైసా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ఇవ్వలేదన్నారు. రాష్ట్ర నిధుల కోసం బీజేపీ ఎంపీలు అంతా కేంద్ర ప్రభుత్వం పోరాటం చేయాలని సూచించారు. కేంద్రప్రభుత్వానికి మొదటి నుండి తెలంగాణ పట్ల వివక్ష ఉందని గౌరి సతీష్ పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ ప్రజలకు పనికిరాని బడ్జెట్ అని విమర్శించారు.

గుర్తు తెలియనివ్యక్తి మృతి



సంతోష్‌నగర్: ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియనివ్యక్తి(35) మృతి చెందాడు. ఐ.ఎస్.సదన్ ఎస్సై విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోజ్ గార్డెన్ పక్కన ఈ నెల 9న గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం అతడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే సంప్రదించాలని పోలీసులు సూచించారు.

కాంగ్రెస్‌తోనే పెన్షనర్లకు భరోసా

గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్

నాంపల్లి: గోపనపల్లిలో టీఎన్జీఓస్ గచ్చిబౌలి మ్యాక్ హౌసింగ్ సొసైటీకి కేటాయించిన స్థలాలను అప్పగించే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో తెలంగాణ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోపనపల్లి ఇళ్ల స్థలాల సమస్యపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగాచిన్నారెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి సొసైటీకి న్యాయం చేకూర్చుతానని హామీ ఇచ్చారు. తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంమాట్లాడుతూ ఉద్యోగులందరూ అక్కడే ఇళ్లు నిర్మించుకునే అవకాశం లభిస్తుందని ఆకాంక్షించారు. ఈ స్థలం న్యాయపరమైన చిక్కుల్లో ఉండటంతో ఉద్యోగులు ఇళ్లు నిర్మించుకోలేకపోయారని, ఈ భూమి ఉపయోగంలో లేదన్న కారణంతో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం దానిని లాక్కుందని అసోసియేషన్ అధ్యక్షుడు కనకం కొమురెల్లి అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, టీఎన్జీఓస్ గచ్చిబౌలి మ్యాక్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు ముత్యాల సత్యానారాయణ గౌడ్, అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ తూము అశోక్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ గోట్ల సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎన్‌జే ఆసుపత్రిలో అన్నదానం



కార్యక్రమంలో పాల్గొన్న మారం జగదీశ్వర్, ఎస్ఎం ముజీబ్ హుస్సేని

అబిడ్స్: ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో దాదాపు 600 మందికి అన్నదానం నిర్వహించారు. పౌష్టిక అల్పాహారాలను కూడా పంపిణీ చేశారు. టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ఈ అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.విక్రమ్ కుమార్, జిల్లా నాయకులు కేఆర్.రాజ్‌కుమార్, హరిబాబు, వైదిక్ శాస్త్ర, శ్రీధర్ నాయుడు, ఏపీఆర్‌ఓ మొహ్మద్ వహీద్, ఆసుపత్రి సభ్యులు శివకుమార్, శేఖర్, పబ్లిక్ గార్డెన్ అధ్యక్షులు మొహ్మద్ మొయినుద్దీన్ పాల్గొన్నారు.

అమ్మవారికి రుద్ర త్రిశతి హోమం



అమ్మవారికి బిల్వార్చన చేస్తున్న క్రాంతికుమార్ దంపతులు

యాకుత్‌పురా: ఆషాఢమాసం బోనాల ఉత్సవాల సందర్భంగా పాతబస్తీ హరిబౌలి శ్రీఅక్కన్న,మాదన్న మహాంకాళీ దేవాలయంలో మంగళవారం అమ్మవారికి రుద్ర త్రిశతి హోమం, బిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్‌పీ క్రాంతికుమార్ దంపతులతోపాటు అర్చకులు రవి నారాయణమూర్తి, గోపాల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బిహార్ యువకుడి మృతి

లంగర్‌హౌస్: జీవనోపాధికై వలస వచ్చిన యువకుడిని గుర్తు తెలియని కారు ఢీ కొట్టడంతో మృతి చెందాడు. లంగర్‌హౌస్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... బిహార్‌లో నివాసముండే సుజితకుమార్(19), నిఖిత్ కుమార్‌లు స్నేహితులు. గతంలో కొద్ది నెలలు నార్సింగిలో నివాసముంటూ కూలీపనులు చేశారు. పనులు దొరక్కపోవడంతో ఏడాది క్రితం సొంత గ్రామానికి వెళ్లిపోయారు. మూడు నెలల క్రితం మళ్లీ నగరానికి వచ్చి మారేడుపల్లిలో నివాసముంటూ కూలీపనులు చేస్తున్నారు. అయితే నార్సింగిలోని స్నేహితులతో కలిసి ఆదివారం ఉదయం గండిపేటలో పార్టీ చేసుకున్నారు. తిరుగు ప్రయాణంలో మెహిదీపట్నం వద్ద ఆర్టీసీ బస్సు దిగారు. రోడ్డు పక్కన నిలబడి ఉన్న సుజిత్‌ను గుర్తుతెలియని కారు ఢీకొట్టి పోయింది. అతడిని వెంటనే గోల్కొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తెల్లవారుజామున సుజిత్ మృతి చెందాడు. వైద్యులు లంగర్‌హౌస్ పోలీసులకు సమాచారం ఇవ్వగా నిఖిత్‌ను తీసుకొని వచ్చి ప్రమాదం జరిగిన ప్రాంతం కోసం వాకబు చేశారు. అయితే అతను చూపిన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పరిశీలించగా, ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదని పోలీసులు తెలిపారు.

అక్రమ డొనేషన్ల వసూలుపై నిరసన

గోల్కొండ: అక్రమంగా డొనేషన్లు వసూలు చేస్తున్న నారాయణమ్మ ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఓయూ జేఏసీ అధ్యక్షుడు భైరు నాగరాజుగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగవారం షేక్‌పేట్‌లోని కాలేజీ ముందు ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. యాజమాన్య కోటా సీట్లకు రూ.లక్షల్లో డొనేషన్లు వసూలు చేస్తూ వ్యాపారం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి కళాశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శంకర్, మహేష్, సూర్యం, మహేష్‌గౌడ్, ప్రవీణ్, విజయ్, చింత మహేష్, కార్తీక్, వెంకటేష్, పృథ్వీ తదితరులున్నారు.